

# కళ్లలో నిజం

ఎస్. ఎస్. ప్రసూన

*మనిషికి ముందు పుట్టినవి నమ్మకాలు. ఈనాటికి కాదు కలకాలం నిలిచి ఉండే శక్తి నమ్మకాలకు ఉన్నది. ఏమైనా జరిగితే మరీ నమ్మకం. ఆగతం అంటే అందునా ఊహకు అందనిది అంటే మనిషికి భయం కాదూ, మరి?*

"అక్కయ్యోయ్" అని ఒక్క కేక పెట్టింది కల్యాణి. వంట ఇంట్లో కూర ముక్కలు తిరగ మోతలో వేస్తున్న శాంత ఒక్కసారి ఉలిక్కిపడి సగం ముక్కలు క్రింద పారబోసి చేతిలో గరిటెతో సహా హాల్లోకి పరిగెతు కు వచ్చింది. చెల్లెలు

కల్యాణి గుక్కపట్టి నవ్వుతున్నది. తమ్ముడు పెదాలు బిగించి వచ్చే నవ్వు ఆపుకునేందుకు వృధా ప్రయత్నం చేస్తున్నాడు. శాంత భర్త రామ్మూర్తి సోఫాలో జార్లపడి స్వయం కల్పితమైన శ్వేత మేఘమాలికల్లో తన్మయాన్ని అనుభవిస్తూ, ఊహాలోకాల్లో విహరిస్తున్నాడు. ఇదంతా చూసిన శాంతకు ఏమీ అర్థంకాక,

"ఏమిటే కల్యాణీ? ఏం కొంప మునిగిందని అల్లా గావుకేకలు వేస్తున్నావు! ఆ చెప్పేది ఏమిటో త్వరగా చెప్పు. నాకు బోలెడు పని ఉన్నది" అన్నది శాంత చెల్లెల్ని ఉద్దేశించి.

"అది కాదక్కయ్యా మరి- -మరి భావగారికి" అని మాట అర్థోక్తిలోనే ఆపేసి మళ్ళీ నవ్వు మొదలెట్టింది కల్యాణి.

"నీతో పాటూ నవ్వుతూ కూర్చునేందుకు తీరిక లేదు. నువ్వూ, నీబావా ఎల్లాగన్నా ఊరేగండి" అంటూ లోపలికి పోబోయింది శాంత.

"వెళ్ళకు అక్కాయ్. ఈ పుస్తకం చూసి వెళ్ళు" అంటూ ఆ రోజే వచ్చిన వారపత్రిక ఇచ్చింది శాంతకు.

"సరే! ఇదేనా, ఇంకేమిటో అనుకున్నాను. పత్రిక చదువుతూ కూర్చుంటే వంటిల్లు ఊరుకోదు. అదేదో నువ్వే చదువుకుని, చదువుకునీ నవ్వుకో" అన్నది శాంత.

"అంతా వద్దులే. అందులో ఉన్న వారఫలాలు ఒక్కటే చదవ్వే అక్కాయ్! పాపం భావగారికి ఎంత కష్టం వచ్చింది (రాబోతుంది) తెలుసుకుని నువ్వు సహాయం చేయకపోతే ఎలా?" తమ్ముడు కూడా నవ్వటం మొదలు పెట్టేతే, ఏమో అని వారఫలాల్లో ఉద్యోగ వ్యాపారాల్లో అభివృద్ధి; ధన హాని—అని చదివేసరికి శాంతకు కూడా నవ్వొచ్చింది.

"ఏమిట్రా అల్లా ఊరికే విరగబడి పోతారు? సకల శుభ లక్షణ సంశోభితులైన మీ భావగారు ధన హాని చేస్తారంటే, అన్న వాళ్ళకు విన్న వాళ్ళకు కూడా పాపం చుట్టుకుంటుంది. కాక పోతే చతుర్ముఖ పారాయణాన్ని క్రమం తప్పకుండా ఆచరించే దీక్షాపరులు కనక ఏదో నెలకు పచ్చ కాగితంలో సగం మాత్రమే సద్వినియోగం చేస్తారు. అయినా లక్ష్మీ పుత్రుడైన మీ భావగారికి అదో లెక్కా ఏమిటి? ఇంతకూ ఉద్యోగ వ్యాపారాల్లో అభివృద్ధి అయితే ధనలాభం అని ఉండాలి గానీ, ధన హాని ఏమిట్రా?" నవ్వుతూ అన్నది శాంత.

"అదే, అక్కాయ్, మా సందేహం కూడాను. అది మా భావగారి ప్రత్యేకత కాబోలు" తమ్ముడు అన్నాడు.

"ఊరుకోండిరా, పాపం, మీ భావగారు అప్పుడే బెంగెట్టుకున్నారు" మూర్తివైపు తిరిగి ఓదార్పుగా అన్నది శాంత.

# కల్లలో నిజం

"అది కాదు. దైవజ్ఞుల మాటల్ని అక్షరాలా అమల్లో పెట్టే మార్గంకోసం అన్వేషిస్తున్నారు" తమ్ముడు అన్నాడు. ముగ్గురూ ఇంత గొడవగా నవ్వుతూన్నా మూర్తిలో కొంచెం కూడా చలనం కలక్కపోయే సరికి కల్యాణికి బోలెడు ఉక్రోషం వచ్చింది.

"ఏమండోయ్, భావగారూ, మేము ఇంత సేపటినుంచీ మీకు రాబోయే కష్టానికి సానుభూతి సభ జరుపుతూంటే మీరు కొంచెం కూడా కృతజ్ఞత చూపకపోవటం చాలా దారుణంగా ఉన్నది సుమండీ!"

కల్యాణి గట్టిగా అనేసరికి "ఏమిటి కల్యాణీ! పనీ పాటూలేని వాళ్ళకు ఇతర్లను ఆడిపోసుకోటం అదొక సరదాలే. అందులో నన్ను కూడా ఇరికించకు" అన్నాడు మూర్తి తన సమాధి భంగం అయినందుకు కించిత్తుగా భ్రుకుటి ముడిచి.

"ఎంత అన్యాయమండీ! మీకు ధన నష్టమైపోతూందని మేము ఊహ బాధపడి పోతూంటే, ఆడిపోసుకోట మంటారా?" మూతి ముస్నలా చుట్టి చిలిపిగా భావగారి వంక చూస్తూ అన్నది కల్యాణి.

"నిజమే. అరడజనుమంది మరదళ్ళు, అరడజనుకు ఒక్కరు తక్కువగా భావమరదులు కలిగినవాడోటి అదృష్టవంతులకు ధనహాని కాక ఏమిటిలే? పాపం, మీ రింతగా నాకు సానుభూతి చూపుతున్నారు కనక మీరు ఇంకో నెల రోజులు ఉండటానికి అనుమతి ఇచ్చేస్తున్నాను" అభయ హస్తాన్నిచ్చే పోజులో అన్నాడు మూర్తి.

"ఏమి కబుర్లు భావగారూ! ఈ కుషన్ కుర్చీలూ, రేడియోలూ అన్నీ తమరి స్వార్జితమా అండీ? మా నాన్నగారు చెమటోడ్చి సంపాదించిన పాతికవేల రూపాయలతో వచ్చిందండీ మా అక్కయ్య. మేము ఎన్నాళ్ళు ఉండి తింటే అదంతా తరుగుతుంది భావగారూ" గర్వంగా అన్నది కల్యాణి.

"మాటలు నేర్చిన చిలకవేలే! నువ్వు ఎంత గ్రాడ్యుయేట్‌వని గర్వపడ్డా, అందకత్తెవని భ్రమసినా, నిన్ను ఊరికే చేసుకునేందుకు ఎవరూ రారులే. మిడిసిపడబోకు. అసలు మీ నాన్న వెలిగించిన కలెక్టర్ గిరీకి అల్లుడికి కారు అయినా ఇవ్వకపోవటం ఎంతో తలవంపులు. అమాయకుణ్ణి కనుక నేను ఊరుకున్నాను గానీ, రాబోయే చిన్నల్లుడు మామగారి గౌరవాన్ని నిలబెట్టేవాడే వస్తాడులే."

"ఉద్ధరించారులెండి మా నాన్నను! చూడవే అక్కాయ్, భావగారు ఏమంటున్నారో? నువ్వు పండక్కు రమ్మని వ్రాశావని, నిన్ను చూసి చాలా రోజులు అయిందిగదా పోనీ అని మేమువస్తే నాలుగు రోజులైందో లేదో అపుడే భావగారి నిధి నిక్షేపాలన్నీ తరిగిపోతున్నట్లుగా బాధపడి పోతున్నారు. పోనీలే బావా నేను ఈ వేళే రైలెక్కుతున్నాను" చిరుకోపంతో అన్నది కల్యాణి.

"నువ్వు ఇవ్వాళే రైలెక్కితే నా కేమీ అభ్యంతరం లేదు గానీ నీతోపాటూ మీ అక్కయ్యను కూడా తీసుకువెళ్ళు. లేకపోతే రేపట్నుంచీ నాచేత బలవంతంగా ఉపవాసాలు చేయిస్తుంది."

"భలే తెలివి భావగారిది. అది మాతో వస్తే దానికి వెనకాలే మీరూవచ్చి బహుమానాలు దండుకు రావాలనా? అదే మీ లాభంలేదు భావగారూ" అంటున్న కల్యాణి మాటలకు వాకిట్లోంచి మూర్తి స్నేహితుడు పిలవటంతో బ్రేకు పడింది.

• • •

సాయంత్రం మూర్తి భావమరిదితో కలిసి రోడ్ల సర్వే (షికారు) చేయటానికి వెళ్ళతూంటే—

"ఒరేయ్ తమ్ముడూ, మీ బావగార్ని జాగ్రత్తగా ఇంటికి (సర్వుతోసహా) తీసుకురారా" అన్నది శాంత నవ్వుతూ.

"అదేమిటి అక్కాయ్! కొత్త ఊరుగదా, ఆయనే నన్ను తీసుకురావాలి. నేను నిమిత్త మాత్రుణ్ణి. బావగారు ఎటు తీసుకువెళ్ళితే అటు వెళ్ళటమే నా పని" అన్నాడు. నవ్వబోతూ బావగారి మొహంచూసి ఆగిపోయి, మాట్లాడకుండా ఆయన వెనకే నడిచాడు.

ఆపసోపాలు పడుతూ పదీ ముప్పది నిమిషాలకు వేంచేసిన బావా మరదుల్ని చూసేసరికి శాంతకు ఎక్కడలేని కోపం వచ్చింది.

"ఇంతసేపూ ఎక్కడ ఊరేగుతున్నారు? ఇంకా నయం. ఇప్పటికయినా ఇల్లంటూ ఒకటి ఉన్నదని జ్ఞప్తి కొచ్చింది. ధన్యులం" అన్నది శాంత.

"ఆలస్యంగా ఇంటికి వస్తే ఆటంబాంబులు పేలటం మామూలేగా" అని నిర్లక్ష్యంగా బాత్ రూమ్‌లోకి దారితీశాడు మూర్తి.

ఇంక ఇప్పుడేమన్నా ప్రయోజనం లేదని ఊరుకున్నది శాంత.

భోజనాలయి ఆకులు చుట్టేఇస్తూ "ఏమండీ చెల్లాయికీ నాకూ చీరెలు తెస్తావన్నారుగా" మెల్లిగా అన్నది శాంత.

"అన్నాను మరి" నిర్లిప్తంగా జవాబిచ్చాడు మూర్తి.

"ఏం! ఇంతలోకే ఏమి అవాంతరమొచ్చింది?

ప్రకృతి ప్రసాదించిన శాంత తండ్రి.

"అవాంతరమే వచ్చింది. స్నేహితుడు కృష్ణ తెలుసుగా నీకు? వాడి భార్యకు సుస్తీగా ఉన్నదిట. పది రోజులుగా ఆస్పత్రిలో ఉన్నదిట. పాపం, వాడు చాలా ఇబ్బందుల్లో ఉన్నానంటే.!!

"ఇంకేమి ఉన్నది? ఆయన కష్టాలకు మీరు కరిగి నీరై జాలై మీ దగ్గర ఉన్న డబ్బు కాస్తా ఆయన జేబులోకి ప్రవహించిందన్నమాట. అంతే లెండి. తనకుమాలిన ధర్మం చేసేవాళ్ళకు ఇంట్లోవాళ్ళకన్న బైటవాళ్ళే ఆత్మీయులు."

"ఏమిటే శాంతా, అంత ఇదిగా అంటావు? రేపు మనకే ఏదన్నా కష్టంవస్తే అప్పుడు మనమూ ఇంకొకళ్ళ ముందు చేయి జాపాల్సింతే గదా! ఇబ్బందులు అందరికీ వస్తాయి. ఇవాళ మనం ఇంకోళ్ళకు సానుభూతి చూపలేకపోతే రేపు మన ముఖం చూసేవాళ్ళు కూడా ఉండరు. అప్పు డెల్లా ఉంటుందో ఆలోచించు."

"అవునులెండి. మీబోటి పరోపకారులకు అంతగతీ పట్టుతుంది. నేను అనుకుంటూనే ఉన్నానులెండి. అసలే రూపాయల్ని చిల్లపెంకులుగా ఎగరేసుకునే మహానుభావులయ్యే. దానికి సాయం వారఫలం కూడా అదే సూచిస్తోంది గదా!"

"ఈ వారఫలాల్ని నమ్ముకుంటే ఇంకేమీ అక్కర్లేదు. త్వరగానే సన్యాసం తీసుకోవచ్చు. ఇంక చాల్లే గొడవ."

"అవును, గొడవగానే ఉంటుంది. ఏ గొడవా లేకుండా హాయిగా ఉందురుగాని. నేను రేపే మా అమ్మగారి ఇంటికి వెళ్ళిపోతాను."

"చక్కగా వెళ్ళు. ఏ బెదిరింపులకు ఎవరూ జడవరు."

"అవును, జడవటం ఎందుకు? పీడ విరగడ అయిందని సంతోషిద్దురు గాని. అసలు మీరు ఈవేళ డబ్బంతా ఏ పేకాటలోనో తగలేసి వచ్చారు. పైగా కృష్ణట, కృష్ణ, అంతా వట్టి బూటకం. ఏదన్నా అంటే గొడవ. మీ ఇంటికి పో అంటారు. అసలు మీకు నామీద కొంచెం కూడా ప్రేమలేదు. ఉంటే ఇల్లా అనగలిగేవారా?"

"నిజమే. మరి ప్రేమ బజార్లో దొరికే వస్తు వనుకున్నావా? మనస్సు ఇవ్వగలగటం కన్నా పుచ్చుకోగలగటమే గొప్ప సంగతి."

"అబ్బో! కబుర్లకేమి ? పెళ్ళాం పిల్లల సంగతి పట్టించుకోకుండా ఒక్క పూటలో ఏభై రూపాయలు ఆర్పేసి వచ్చి, పైగా ప్రేమను గురించి ఉపన్యాసాలు!"

"చాల్లే, నోర్మూయ్యి" విసుగ్గా అన్నాడు మూర్తి. శాంతకు కళ్ళనీళ్ళ పర్యంతం అయి అక్కడినుంచి లేచిపోయింది.

• • •

ఆరుబయట మంచంమీద పరుండి వార పత్రిక తిరగవేస్తున్నది శాంత.

"అసలే నీ ఆరోగ్యం మంచిది కాదు. మంచు కురుస్తోంటే అక్కడెందుకు? లోపలికి రావే అక్కాయ్." కల్యాణి పిలుస్తోంటే శాంత వినిపించుకోకుండా పత్రికలో నిమగ్నురాలైంది. పేజీలు తిప్పుతూంటే ఆమె దృష్టి వార ఫలాల పేజీమీద పడింది. ఈ వారం శ్రీవారి ఫలితాలు ఏమిటా అని చూస్తూనే ఒక్కసారి షాక్ తిన్నట్లయింది. అంత చల్లని వాతావరణం లోనూ ఒళ్ళంతా చమటతో తడిసిపోయింది. ఊపిరాడక ఉక్కిరి బిక్కిరై పోతున్నట్లు ఏమిటో తెలియని జడత్వంలో పడిపోయింది. అల్లా ఎంతసేపు ఉన్నదో? *కల్యాణి వచ్చి లేపుతూంటే* ఈ లోకంలో పడింది.

"ఇది....ఇది చూడవే కల్యాణీ" అంటూ పత్రిక చెల్లెలి కిచ్చింది.

"దూర ప్రయాణాలు, శారీరక శ్రమ, ప్రమాద సూచన, గాయాలు" అని మూర్తి వారఫలాలు చదువుతూనే కల్యాణి గట్టిగా నవ్వుతూ, "ఏమిటి! అక్కాయ్, నీదంతా మరీ చోద్యం! ఈ ఫలితాలు ఎక్కడైనా నిజమేనా ఏమిటే? ఏదో సరదాకని మనం చదువుతాము. అన్నీ అప్పుడే మరిచిపోవాలి గానీ, అదే మనస్సులో పెట్టుకు బాధపడట మేమిటి?" అని కల్యాణి ఎంతచెప్పినా శాంతకు ఏమీ బుర్రకెక్కలేదు. శాంతకు చిన్నతనంనుంచీ జాతకాల పిచ్చి చాలా ఎక్కువ. ఎవ రేది చెప్పినా చటుక్కున నమ్మేయటమే ఆమె స్వభావం. దానికి తోడు రెండు మూడు సందర్భాల్లో అనుకున్నవి జరిగేసరికి ఆమె భావాలు మరింత బలపడ్డాయి. అంతెందుకు? క్రితం వారం మూర్తి వారఫలితాల్లో ధనహాని అని ఉంటే, ఆవేళ సాయంత్రమే ఏభై రూపాయలూ నీళ్ళపాలు చేసివచ్చాడు. మరి, ఇప్పు డిది మాత్రం జరగదని నమ్మక మేమిటి? జరిగితే? అమ్మయ్యో! ఇంకేమి ఉన్నది? తనూ పిల్లలూ ఏ గంగలోనైనా దూకెయ్యాల్సిందే తప్ప వేరేమీ దారిలేదు. ఆయన కులాసాగా ఉంటే అదే ధనం మూట. అంతకంటే తనకు ఇంకేమి కావాలి? ఏమిటో గుండెల్లో బాధ. వణికిపోయేకాళ్ళతో లోపలికి వచ్చి పరున్న దన్నమాటే గానీ, మెత్త బూరుగు దూది పరుపు ముళ్ళకంపలాగా గుచ్చుకుని బాధ పెడుతూంది. వల్చని మెత్తని కాంతి ప్రసరించే చిన్న బ్లూలైటు భయంకరమైన అగ్ని జ్వాలలాగా కన్పించి భయకంపితురాల్ని చేస్తోంది. పత్రికలో వాక్యాలే మనసులో మెదులుతూ, కత్తులు గుండెల్లో గుచ్చుకున్నట్లు విలవిలలాడిపోతూంది. ఆ దిక్కుమాలిన డబ్బుకోసం ఆవేళ ఆయన్ను ఎన్ని మాటలన్నది? అసలే ఆయనది సుతి మెత్తని మనస్సు. *ఎవర్నీ ఒక్కమాటకూడా అని* ఎరగడు. తనే ఆయన్నురెచ్చగొట్టి విసుక్కునేట్టు చేసింది. నాలుగురోజులు ఆయనతో సరిగ్గా మాట్లాడకపోతే పాపం ఎంతో బాధ పడ్డారు.



చే దో డు

చిత్రం—అన్నవరపు కోటేశ్వర రావు (గుంటూరు-1)

వెళ్ళేటప్పుడు కూడా తనకోపం పోగొట్టాలని ఎన్నో కబుర్లు చెప్పి నవ్వించారు. "నాలుగు రోజుల్లో వస్తాను శాంతా. చెల్లెలూ, తమ్ముడూ నీకు సహాయంగా ఉంటారుగా?" అని తనకు ధైర్యం చెప్పి నాలుగురోజులక్రితమే పనిమీద వెళ్ళిన మూర్తిని తలుచుకొని ఆమె తల్లడిల్లిపోయింది. ఈయనగారు ఇప్పుడెందుకు వెళ్ళారు బాబూ అని ఆక్రోశించిపోయింది. ఎంత ప్రయత్నించినా కంటికి కూర్పు రానేలేదు. ఆవేదనతోనూ, ఆలోచనలతోనూ అలిసిపోయి ఏ అర్ధరాత్రికో మాగన్ను పడింది. ఆకాశమంతా కారుమేఘాలు క్రమ్ముకున్నాయ్. ఝళిపించినట్లుగా మెరుపులు గుండెల్లోంచి దూసుకుపోతున్నాయి. పెళాపెళామంటూ పిడుగులు రాలి గుండెల్ని కదిలించేస్తున్నాయి. కుండపోతగా వాన ఏళ్ళూవూళ్ళూ ఏకమైపోయి, దిక్కులు తెలియని గాడాంధకారం. కెనేడియన్ ఇంజను గర్జిస్తూ ముందుకు ఉరుకుతూంది. దూరంలో ఉన్న నదిమీద వంతెనకు చరమ గడియలు వచ్చినట్లు తెలివి ఇంజను వంతెనతో పాటు తనూ అమాంతం నదిలో పడిపోయింది. ఒక్కసారి ప్రళయ ఘోష, క్షతగాత్రుల హాహాకారాలు. "అమ్మో..." గట్టిగా కేకపెట్టింది శాంత. పక్కగదిలోంచి పరుగెత్తుకొని వచ్చిన తమ్ముడూ, చెల్లెలూ ఆమెను కదిపి లేపుతూ ఉంటే ఉలిక్కిపడి లేచి, చెల్లెల్ని గట్టిగా కావిలించుకుని ఏడుస్తోంది. "ఏమిటే, అక్కాయ్ ఏదన్నా కల వచ్చిందా! అయితేమాత్రం ఇంత పిరికితనమేమిటే? ఛాఛా, నీధోరణి చూస్తే పూర్తిగా మతిపోయినట్లే ఉన్నది" అని అంటూంటే తనకు తనే జాలి చూపుకుంటూ *వేవిధాల భగవంతుణ్ణి* ప్రార్థించటం తప్ప ఏమీ చేయలేకపోయింది. "దేవాదిదేవా! తండ్రీ! ఆయన్ను కులాసాగా ఇంటికి చేర్చు భగవాన్! ఆయన ఆరోగ్యంగా ఉంటేచాలు. ఇంక తనకేమీ

అక్కర్లేదు. కావాలంటే తన ఆయుర్దాయాన్ని కూడా ఆయనకు ఇచ్చివేయగలదు. ఆయన్ను అంత కష్టపెట్టినందుకే తనకు ఇది శిక్ష కాబోలు! తను బాధపడ్డా కులాసాగా ఆయన మళ్లీ తన కంటపడితే చాలు'' అని ఎంతో పరితాపపడుతూంది. బరువుగా రెండుమూడు రోజులు జరిగినయ్యి. ఎప్పుడు ఎక్కడికెళ్ళినా మర్నాడే ఉత్తరం వ్రాసే మూర్తి ఇంతవరకూ ఏమీ జాబు వ్రాయలేదంటే అదికూడా శాంత ఆదుర్దాను మరింత ఎక్కువ చేసింది. మనస్సంతా శంకాకులితమై పోతూ ఏమీ చేయ లేని పరిస్థితులలో పడిపోయింది. రోజులు జరుగుతున్న కొద్దీ ఆమె బాధ అధికమై పోతూంది. ఎప్పుడూ ఏవో అశుభాలే మనస్సు చికాకుపరుస్తున్నాయి. కల్యాణి అక్కకు ఎంత నచ్చచెప్పటానికి ప్రయత్నించినా, ''పెళ్ళయితేకానీ నీకు తెలీదులేవే'' అని చెల్లెలి మీదకూడా విసుక్కొంటూంది. ఒక రోజు సాయంత్రం మూర్తి స్నేహితుడు క్రిష్ణ వచ్చాడు. కాస్సేపు మాట్లాడి వెళ్ళిపోతూ, ''వాడు ఊరు వెళ్ళినట్టు నాకు తెలియదమ్మా. ఉంటాడేమోనని వచ్చాను. మొన్న అవసరమై అడిగితే లేదనకుండా ఇచ్చాడు. నిన్ననే పైకం అందింది. మళ్ళీ వాదగ్గరుంటే ఖర్చైపోతుంది. ఇవి ఉంచమ్మా. వాడు వచ్చాక చెప్పు'' అని అయిదు పది రూపాయలనోట్లు బల్లమీద పెట్టి వెళ్లిపోయాడు. శాంత నోటంట మాట రాలేదు. ఏదో అడగాలనుకొని ఏమీ అడుగలేక పోయింది. ఆ డబ్బు తీసుకోటానికి చేతులు వణికాయి. ఆ డబ్బును గురించి ఆరోజు తాముపడ్డ ఘర్షణ తలుచుకునేసరికి సిగ్గుతో తల నేలకు వంగిపోయింది. తను అంత తొందరపడి ఆయన్ను అంత బాధపెట్టి నందుకు తనకు తగిన శిక్షే లభించిందనుకున్నది శాంత.

పండగ సమీపిస్తూంది. మూర్తి దగ్గర్నుంచి ఉత్తరమే లేదు. శాంతకు ఏమీ తోచడంలేదు. ఈయనగారు ఎక్కడన్నా సుస్తీపడ్డారేమోనని భయపడుతూంది. ప్రమాద సూచన అన్న పత్రికలో వాక్యాలు ఆమె మనస్సులో అగ్నిగోళాలులాగా తిరుగుతున్నాయి. ఎప్పుడు తెల్లవారుతుందో, ఎప్పుడు ప్రొద్దు కూకు తుందోకూడా తెలియని అయోమయంలో పడి పోయింది. శాంత పరిస్థితి కల్యాణి వాళ్ళమ్మ గారికి రాసిందేమో, చిన్న అమ్మాయిల్ని ఇద్దర్నీ తీసుకొని శాంతతల్లి రాత్రే వచ్చింది. తెల్లవారింది అందరికీ ఉత్సాహంగా, శాంతకు విచారంగా. ఇంట్లో తలంట్ల హడావుడి. శాంతలేచి ఇవతలికిరాలేదు. వాళ్ళమ్మగారేవచ్చి ''పండగపూట అల్లాదిగులుగా ఉండకూడదు. ఇవ్వాళో రేపో అతడే వస్తాడు. పనులమీద ఊళ్లకు వెళ్ళకుండా ఉంటా రేమిటే? నీది మరీ చోద్యం. ఇప్పటికాలపు వాళ్లే ఇంతేలే. ఎదటున్న కాస్సేపూ గిల్లి కజ్జాలు పెట్టుకుంటారు. కాస్త కనుమరుగైతే

# కల్లలో నిజం

విలవిలలాడిపోతారు. ఏమిటో కాలవైపరీత్యం. చాల్లేగానీ, లేచి తలంటుకో'' అని శాంత అమ్మ అదలిస్తూంటే కల్యాణి వచ్చి బల వంతంగా జడవిప్పింది. ఇంతలో వాకిట్లో టాక్సీహార్న్. శాంత తమ్ముడు ఒక్కగంతులో వాకిట్లోకి పరుగెత్తాడు. బోలెడు పండగ సరంజామాతో మూర్తి పెళ్ళికొడుకల్లే కార్లోంచి దిగాడు. ఆయనగారి ముఖాన్ని చూడటానికి సిగ్గుపడి, ఏమో అపరాధం చేసినదానిలాగానే గదిలోంచి ఇవతలికి రాలేదు శాంత.

''చంపేశారు బావగారూ! పదిహేనురోజుల్నించీ ఈవిడగారి విరహానికి మేము తాళలేకపోయాము సుమండీ!''అన్నది కల్యాణి.

''ఫరవాలేదులే. మల్లెచెండ్ల వీవనలూ, మంచి గంధంపట్లూ వేయటానికి నువ్వున్నావుగా'' నవ్వుతూ అంటూ మూర్తి గదిలోకి వచ్చాడు.

మూర్తి ఏదో ప్రమాదంలోంచి బయట పడ్డట్టుగా శాంతకు ఎంతో ఆనందం కలిగింది. ముప్పిరిగొన్న సంతోషంతో మాట రాలేక హృదయం మూగ పోయింది. తలవంచు కుని అల్లాగే నిల్చున్నశాంతతో ''కోపం వచ్చిందా శాంతా! బొత్తిగా వీలులేకనే ఉత్తరం రాయ లేదు. ఈ అపరాధానికి నువ్వు విధించే శిక్షను శిరసా-వహించటానికి సిద్ధంగా ఉన్నాను. నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో'' అన్నాడు చిలిపిగా మూర్తి. శాంతకు కళ్ళంట జలజలా నీళ్ళు ప్రవహించాయి. ''మిమ్మల్ని శిక్షించగలిగేదాన్నా నేను? అలా ఎపుడూ అనద్దు'' అని అప్రయ త్నంగా మూర్తి పాదాలమీద వాలిపోయి, ''మీరే నన్ను క్షమించాలి. ఆరోజు మిమ్మల్ని అంతగా కష్టపెట్టినందుకు ఫలితంగా నరకమే అనుభవించాను. ఇంకెప్పుడూ మిమ్మల్ని ఏమీ అనను. నన్ను క్షమించాననండీ'' అంటూ తన జీవితాన్ని వెలుగుబాటల్లో నడిపించుకు వెళ్లే ఆ పాదాలు కన్నీటితో అభిషేకించింది. రెండు బుజాలూ పట్టుకొని లేవతీసి గుండెలకు హత్తుకుంటూ ''నువ్వు మరీ పిచ్చిదానివి శాంతా. పైకి ఎన్నిఅన్నా నీ మనస్సు మధుపూరితమని నాకు తెలీదా? అందుకనే నువ్వేమాటలు నే నప్పుడే మరిచిపోతాను. నాకు కావాల్సింది నీ మనస్సేగానీ, ఇంకేమీ కాదు. ఇంక ఊరుకో-ఛ...ఛ పండగపూటకన్నీళ్లేమిటీ? నే వొచ్చామగా, ఇంకెందుకూ... మానెయ్యాలి... ఏదీ ఒక్క సారి నవ్వు... ఇదిగో నీకో మంచి బహు మానం తెచ్చాను. ఏమిటో చెప్పుకో'' అని మూర్తి శాంత గులాబీ చెక్కిళ్లమీద నీటి ముత్యాలు తుడుస్తూ అనునయించాడు.

''మీరే నాకు వెలలేని బహుమానం. ఇంక నాకేమీ అక్కరలేదు.'' శాంత సిగ్గుతో పెళ్లి కూతురే అయిపోయింది.

''అల్లా వీల్లేదమ్మాయి. తెచ్చాక పుచ్చు కోవాల్సిందే ఏమిటో చెప్పుకో మరి!...''

'' ..హూ..గెలుపు మీదేలెండి. మీ ముందు నేను ఎప్పుడూ ఓడిపోతూనే ఉంటాను.''

''అల్లాగే. పాపం! రాణిగారి కడగంటి చూపులకోసం పడిగాపులుపడి ఉన్న రోజులు ఎన్నిలేవు!'' అని చిలిపిగా చూస్తూ, చిన్న ముఖమల్ పెట్టె లోంచి ముద్దులొలుకుతున్న చిన్న జాతిరత్నం పొదిగిన బంగారపు టుంగరం ఆమె వేలికి తొడుగుతూ ''మా దేవిగారి అంగుళిని అలంకరించితేనే ఈ ఉంగరం శోభ మరింత ఇనుమడిస్తుంది'' అని అంటూంటే ఆ క్షణంలో తననుతానే మరిచిపోయింది. ఆయన గారి ఇంత అనురాగానికి నేను అర్హురాలినా అని సిగ్గుపడిపోయింది. పసిపాపలా గా అతని హృదయంమీద వాలి ఆనందబాష్పాలతో ఆ విశాలవక్షం తడిపేసింది. అక్కడే టేబుల్ మీద ఉన్న పత్రికలో వారఫలాల పేజీలు రెపరెపా కొట్టుకుంటూంటే ఆ కాగితాలు తనను వెక్కిరించి నవ్వుతున్నట్లుగా శాంతకు వాటి మీద ఎంతో కోపంవచ్చింది. ఆమె భావాన్ని గ్రహించిన మూర్తి—''ఏదీ ఈవారం పతీపతుల సంయోగమని _ ఉన్నదేమో చూద్దాం'' అనే సరికి ''ఇప్పటి కయింది చాల్లెండి'' అని అతని చేతులు విడిపించుకుని పరుగెత్తింది. ★

## జాగ్రత్త

*నా స్నేహితుడు రాము, అతని తమ్ముడు శేషు (ఆరేళ్ళవాడు) బజారుకు వెళ్ళుతున్నారు. రాము బీడీ కాలుస్తున్నాడు. దారిలో మాస్టారు ఎదురైనారు. మావాడు గబుక్కున బీడీ దూరంగా విసి రేసి, వినయంగా మాస్టారికి వందనంచేసి, ఆయనతో మాట్లాడు తున్నాడు. అంతరకు అన్న చేయి పట్టుకుని నడుస్తూ ఉన్న శేషు ఒక్క అంగలో ఆ బీడీ పడిన చోటుకు వెళ్ళాడు. దాన్ని పట్టుకుని తిరిగివచ్చి, "అన్నయ్యా, అన్నయ్యా! బీడీ పూర్తికాకుండా పారేశావేరా? ఇదిగో కాల్చుకో" అని దానిని అన్నగారికి అందిం చాడు.*

—బొడ్డుపల్లి కృష్ణావధాని
(కొవ్వూరు)